Dronavalli Harika

పిల్లలందరూ చందమామ కథలు వింటుంటే... ఆమె మనసులో మాత్రం రాజు, రాణి, మంత్రి, సైన్యం కళ్లలో మెదలాడేవారు. తన వయస్సు వారంతా కలర్ టీవీకి అంకితమయితే, ఆమెకు మాత్రం నలుపు తెలుపు రంగుల్లో ఉన్న 64 గడులే ప్రపంచమయ్యాయి. చదరంగమే ఆమె జీవితమయింది. ఆటే ఆమెకు ప్రాణమయింది. ఆమే తెలుగు తేజం ద్రోణవల్లి హారిక. పదమూడేళ్ల వయస్సులోనే ఉమెన్ గ్రాండ్ మాస్టర్‌గా అవతరించి, భారత చెస్ టీంలో సభ్యురాలైంది. చిన్న వయసులోనే ఛాంపియన్ షిప్‌లు, అవార్డులు, రివార్డులతో భారత పతాకాన్ని రెపరెపలాడించింది.

హారిక 1991లో గుంటూరులో జన్మించింది. నాన్నకు ఆటలంటే ఆసక్తి. నిజానికి హారిక అక్కను చదరంగంలో ఛాంపియన్ చేయాలనుకున్నారాయన. టైంపాస్‌గా అక్కతోపాటు వెళ్లిన హారికకు ఆట మీద పట్టు పెరిగింది. ఏడేళ్ల వయసు వచ్చేసరికి స్కూలింగ్ ఆపేసి.. చెస్‌నే ప్రొఫెషన్ ఎంచుకుంది. అండర్-9తో నేషనల్స్, అండర్-10తో ఇంటర్నేషనల్ కెరియర్ మొదలుపెట్టిన ఈ చదరంగపు రాణి... అప్పటికే జగజ్జేతలయిన జుడిట్ పోల్గర్, క్రామ్నిక్, విశ్వనాథ్ ఆనంద్‌లను రోల్‌మాడల్‌గా ఎంచుకుంది ముందుకుసాగింది.

గంటల తరబడి చెస్ పుస్తకాలు చదవడం, ఎవరు దొరికినా బోర్డు ముందేసుకుని ఆడడం ఇదీ హారిక దినచర్య. ఇల్లయినా, ప్రయాణమయినా ఇదే తీరు. 16 నేషనల్ మెడల్స్‌తోపాటు... 2004 ఉమెన్ గ్రాండ్ మాస్టర్, 2007 ఇంటర్నేషనల్ మాస్టర్, 2011 గ్రాండ్ మాస్టర్... ఇలా చెప్పుకుంటూ పోతే.. ఎన్నో మరెన్నో. ప్రపంచ ఛాంపియన్ షిప్‌లో రెండుసార్లు బ్రాంజ్ మెడల్ గెలిచిన హారికను 2008లో ప్రతిష్టాత్మక అర్జున్ అవార్డు వరించింది. 2016 ఫిడే మహిళల ర్యాంకింగ్స్‌లో 11 నుంచి ఏకంగా అయిదో ర్యాంకుకు చేరుకుంది హారిక.

ఆట పూర్తయ్యే వరకు ఆమెకు ఎవరైనా ప్రత్యర్థి. ఆ తర్వాత వాళ్లకు స్వయంగా వండి వడ్డించడం హారికకు అలవాటు. పార్టీలకు, పబ్లిసిటీకి దూరంగా ఉంటూ సింపుల్ లైఫ్‌ను లీడ్ చేస్తున్న ఈ గ్రాండ్‌మాస్టర్... మనం స్ఫూర్తి పొందాలే కాని ప్రతి మనిషిలో నుంచి పొందవచ్చు అంటారు.  గతేడాది చైనాలో మహిళల గ్రాండ్ ప్రీ టోర్నీలో స్వర్ణ పతకాన్ని సాధించిన హారికను... సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్స్ 2016... మోస్ట్ పాపులర్ ఫిమేల్ స్పోర్ట్స్ పర్సనాలిటీ ఆఫ్ ద ఇయర్‌గా సత్కరిస్తోంది.